రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులు



పనులు ప్రారంభించిన కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కస్తూరిబానగర్‌లో రూ. 20 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీల్లో యూజీడీ, తాగునీటి పైపులైన్లు పూర్తయిన వీధుల్లో సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. దెబ్బతిన్న రోడ్ల స్థానంలో కొత్త రహదారులను నిర్మిస్తున్నామన్నారు. ఏఈ శ్రీకాంత్, వీఐ రజనీకాంత్, నాయకులు బాబు, సత్యనారాయణ, ఉమేష్‌సింగ్, కిషోర్, హబీబ్, బషీర్, సుధాకర్, నారాయణ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



మహాధర్నా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేటీఆర్

మల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో జేఏసీ ఆధ్వర్యంలో నవంబర్ 5న నిర్వహించబోయే చలో హైదరాబాద్ మహాధర్నా వాల్‌పోస్టర్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు. బీఆర్‌టీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య, బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబుయాదవ్, ఉపాధ్యక్షులు రమేష్, హైమద్‌బాయ్, రామకృష్ణ తదితరులున్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడమే లక్ష్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో అభివృద్ధి సంక్షేమ ఫలాలు అర్హులకు అందేలా కృషి జరుగుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్‌లో నిర్వహించిన ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పనిచేసే విధంగా కమిటీలను అందజేయాలని నేతలకు సూచించారు. పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్ష కేంద్రం పరిశీలన



పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన పోలీసులు, అధికారులు

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని గ్రూప్-1 మెయిన్స్ పరీక్షా కేంద్రం ప్రోబుల్స్ హైస్కూల్‌ను పోలీస్ విభాగం అధికారులు పరిశీలించారు. క్రైమ్ విభాగం డీసీపీ అరవింద్‌బాబు, ఎస్‌ఓటీ డీసీపీ రమణారెడ్డి, మల్కాజిగిరి పీఎస్ సీఐ సత్యనారాయణ పాఠశాల యాజమాన్యాన్ని ఏర్పాట్లపై ఆరా తీశారు. సుమారు 1390 మంది విద్యార్థులు హాజరవుతున్నారని ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు జరిగేలా చూస్తామన్నారు.

తల్లిపై పోక్సో కేసు..

వ్యభిచారంలోకి దింపేందుకు యత్నం

అల్వాల్: కూమార్తెను వ్యభిచారంలోకి దింపడానికి ప్రయత్నించిన తల్లిపై పోక్సో కేసు నమోదైన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వెంకటాపురంలో నివసించే మహిళ (40) భర్తకు దూరంగా ఉంటోంది. ఆమె 14 ఏళ్ల కుమార్తె మూడ్రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయి బుధవారం అల్వాల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తల్లిపై ఫిర్యాదు చేసింది. తనతో పాటు వ్యభిచారం చేయమని తల్లి ఒత్తిడి చేయడంతో తాను ఇంట్లో నుంచి పారిపోయి వచ్చానని తనకు రక్షణ కల్పించమని పోలీసులకు ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న తల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తన కుమార్తెను అప్పగించాలని పోలీసులతో వాగ్వివాదానికి దిగింది. వారు సదరు మహిళపై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. బాలికను సఖి సెంటర్‌కు తరలించారు.

యువకుడి దాడిలో గాయపడిన వృద్ధుడి మృతి

నిందితుడి రిమాండ్



ఆంజనేయులు (ఫైల్)

అల్వాల్: రోడ్డుపై వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడిని మందలించిన ఓ వృద్ధుడిపై దాడి జరిగిన ఘటనలో వృద్ధుడు 15 రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అల్వాల్‌లో నివసించే ఆంజనేయులు (68) రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి. కాగా గతనెల 30న ఓల్డ్ అల్వాల్ ఓ బేకరీ వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనదారుడిని మందలించడంతో ద్విచక్ర వాహనదారుడు దీపక్ వృద్ధుడిపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఆంజనేయులు తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా 15 రోజుల పాటు చికిత్స పొందుతూ ఈనెల 15న మృతిచెందాడు. దీంతో మృతుడి కుమారుడు ప్రవీణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా వాల్మీకి మహాకవి జయంతి



వాల్మీకి జయంతి వేడుకల్లో మేయర్ అమర్‌సింగ్



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ అజయ్‌యాదవ్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో గురువారం రామాయణ మహాకావ్య గ్రంథ రూపశిల్పి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు వాల్మీకి జయంతి వేడుకల నేపథ్యంలో నగర మేయర్ అమర్‌సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్‌లు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రామాయణాన్ని మధురకావ్యంగా మలిచి మానవజాతికి నిర్దేశించిన మహనీయుడు శ్రీ వాల్మీకి మహారుషి అని కొనియాడారు. రామాయణాన్ని రచించడమే కాదు సాంస్కృతిక భాషకు ఆదికవిగా కూడా ప్రసిద్ధి గాంచారన్నారు. కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, కార్పొరేటర్లు భీమ్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, కొండె పోచయ్య, కో- ఆప్షన్ సభ్యులు చిదుముల జగదీశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి, బొడిగె కృష్ణగౌడ్, శ్రీధర్‌రెడ్డి, మహేష్, బండారి రవీందర్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మేయర్ అజయ్‌యాదవ్, కమిషనర్ రామలింగం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, చీరాల నర్సింహ్మా, సుమన్‌నాయక్, సింగిరెడ్డి పద్మారెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మాన్‌గౌడ్ నేతలు వెంకటేశ్‌గుప్తా, శేఖర్‌రెడ్డి, కృపాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

చదువు మీది ఫీజు బాధ్యత నాది

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



విద్యార్థినికి మిఠాయి తినిపిస్తున్న ఎమ్మెల్యే బండారి

ఉప్పల్: 'చదువు మీది ఫీజు బాధ్యత నాది' అనే నినాదంతో ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి భరోసా ఇస్తున్నారు. చదువుల్లో ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు ఆపన్న హస్తం అందిస్తూ గురువారం ఉప్పల్ చిలుకానగర్, మల్లికార్జుననగర్ ప్రాంతానికి చెందిన ఒరుసు యాదమ్మ, ఈదయ్యల కుమార్తె నందినికి స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌తో కలిసి ఆర్థికసాయం చేస్తానని హామీ ఇచ్చారు. నందిని నీట్ ప్రవేశపరీక్షలో రాష్ట్రస్థాయి ఎంబీబీఎస్‌లో ర్యాంక్ సాధించడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కార్పొరేటర్ బన్నాల గీత ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే నందిని ఐదేళ్ల ఫీజును చెల్లిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థినికి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి



ఈసీఐఎల్‌లో నిరసన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

కాప్రా: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సత్వరమే చెల్లించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర అన్నారు. గురువారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కాప్రా సర్కిల్ కార్యాలయం నుంచి ఈసీఐఎల్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ సర్కార్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఉన్నత విద్యారంగాన్ని అభివృద్ధి చేసి, మేధోసంపతిని పెంచాల్సిన పాలకులు విస్మరిస్తున్నారని మండిపడ్డారు. ఏఐవైఎఫ్ నాయకులు సత్యప్రసాద్, గిరిబాబు, శేఖర్, మహేష్, సొహైల్, అజీమ్‌పాషా, ఆర్తి, అస్మా, దేవి, సంధ్య, నీలిమ, మధురిమ, కీర్తన, నయన, స్వాతి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు సహకరించండి



బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పరిశీలించిన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: కాలనీల్లో పచ్చదనం పరిశుభ్రతకు సహకరించాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ కాలనీవాసులకు సూచించారు. డివిజన్ పరిధిలోని ఆర్‌కేకాలనీలో పరిశుభ్ర హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వీధుల్లో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని, భవన నిర్మాణ వ్యర్థాలను తొలగింపజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతగా వ్యర్థాలను గుర్తించి బహిరంగ ప్రదేశాల్లో కాకుండా ఆటోలకు అందజేయాలన్నారు. ఆటో కార్మికులకు ఉపాధి కల్పించేవారమే కాకుండా స్వచ్ఛ భారత్‌కు సహకరించిన వారమవుతామన్నారు. ఏఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ మంజుల, ఏఈ నవీన్, ఎస్ఎస్ చింత శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏ వసంత, గిరి, రమేష్, రవి, జయంతి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసం..

రూ.2.5 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

అల్వాల్: ఆన్‌లైన్ మోసంతో ఓ బాధితుడు రూ.2.5 లక్షలు పోగొట్టుకున్న ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ అల్వాల్ సూర్యానగర్‌లో నివసించే జైపాల్‌రెడ్డి వ్యాపారి. కాగా బుధవారం ముంబాయి క్రైమ్ ఇన్వెస్టింగ్ పోలీసుల పేరుతో జైపాల్‌రెడ్డికి ఫోన్ వచ్చింది. తాము పోలీసులమని మీ ఆధార్‌కార్డు నెంబర్‌తో సిమ్ తీసుకుని వాటి ద్వారా అసభ్య మెసేజ్‌లతో పాటు వీడియోలు పంపారని భయభ్రాంతులకు గురిచేశారు. సినీనటి శిల్పాశెట్టి భర్త రాజ్‌ఠాకూర్ రూ.65 లక్షలు మీ అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేశారని, మా వద్ద ఆధారాలు ఉన్నాయని, మీపై కేసు నమోదు చేస్తున్నామని భయభ్రాంతులకు గురిచేశారు. సుప్రీంకోర్టులో అంతా సెట్ చేస్తామని, మీపై కేసులు రాకుండా చూడాలంటే రూ.3 లక్షలు చెల్లించాలని నమ్మబలికారు. దీంతో భయపడిన జైపాల్‌రెడ్డి పలు దఫాల వారీగా వారికి రూ.2.5 లక్షలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్ల వల్ల మోసపోయానని గ్రహించిన బాధితుడు గురువారం 1930తో పాటు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

మేడ్చల్: మేడ్చల్ మార్కెట్ కమిటీ పాలకవర్గం కమిటీ పరిధిలోని రైతులకు నాణ్యమైన సేవలు అందించి, వారి అభివృద్ధి కోసం కృషి చేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. కండ్లకోయలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో నూతన పాలకవర్గం పదవీ స్వీకారోత్సవానికి హాజరై అభినందించారు. నూతన చైర్మన్ నర్సింహులుయాదవ్ మాట్లాడుతూ.. పాలకవర్గం రైతులకు మెరుగైన సేవలు చేస్తూనే మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మెరుగైన వసతులు కలిపిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సరిత, చర్లపల్లి కార్పొరేటర్ శ్రీదేవి, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

హడావుడిగా కార్యక్రమం..

మేడ్చల్ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రకటన చేసినప్పటి నుంచి నియోజకవర్గ కాంగ్రెస్‌లో అసంతృప్తి చెలరేగింది. నూతన కమిటీని రద్దు చేయాలని అధిష్టానానికి ఫిర్యాదులు అందాయి. దీంతో అట్టహాసంగా నిర్వహించాల్సిన పదవీ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని కమిటీ కార్యాలయంలో నామమాత్రంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రధాన నాయకులు, మేయర్లు, చైర్మన్లు, కౌన్సిలర్లు, పట్టణ, మండల కమిటీల అధ్యక్షులు సైతం కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. కార్యక్రమాన్ని నాలుగు గోడల మధ్య ముగించడంతో సగటు కాంగ్రెస్ కార్యకర్త ప్రశ్నించడంతో తర్వాత అట్టహాసంగా నిర్వహిస్తామని కొంతమంది నాయకులు సర్దిచెప్పినప్పటికీ.. సమయం ఆలస్యమైతే ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయోనని ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని హడావుడిగా నిర్వహించారని కాంగ్రెస్ నాయకులు వివరించారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



సుప్రియ

మల్లాపూర్: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు మల్లాపూర్ సూర్యనగర్ కాలనీలోని మోడ్రన్ హైస్కూల్‌కు చెందిన పదోతరగతి విద్యార్థిని ఎం.సుప్రియ ఎంపికైంది. ఈనెల 9న నల్గొండలో జరిగిన ఖోఖో పోటీలలో ప్రతిభ కనబరిచింది. నేడు తమిళనాడులో జరిగే తెలంగాణ రాష్ట్ర ఖోఖో జట్టు తరుపున పాల్గొననుంది. రాష్ట్ర ఖోఖో సంఘం కార్యదర్శి క్రిష్ణమూర్తి, జిల్లా అధ్యక్షులు మంజుల, మోడ్రన్ హైస్కూల్ యాజమాన్యం ముత్యంరెడ్డి, సచీదేవీ, లక్ష్మీ ప్రసన్న, కోచ్ నరేంద్రలు విద్యార్థినిని ఈ సందర్భంగా అభినందించారు.

పరామర్శ



మల్లాపూర్: నాచారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టేకులపల్లి రాంచందర్ తల్లి వజ్రమ్మ అనారోగ్యానికి గురికావడంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నాచారంలోని ఆయన ఇంటికి వెళ్లి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ ఉన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం



గౌతంనగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మల్కాజిగిరి సెంట్రల్, లయన్ శోభన్‌బాబు ఆధ్వర్యంలో మిర్జాలగూడలోని సెయింట్ ఆంథోని అనాథాశ్రమంలో గురువారం అన్నదానం చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పటేల్‌కుంట చెరువు పరిశీలన



చెరువు వద్ద ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: రూ. కోటి 80 లక్షలతో నాచారం పటేల్‌కుంట చెరువు వద్ద నిర్మించిన సివరేజ్ డైవర్షన్ పైపులైన్‌ను వాడుకలోకి తీసుకురావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం నాచారం పటేల్‌కుంట చెరువును ఇరిగేషన్ అధికారులతో కలిసి సందర్శించారు. చెరువు చుట్టూ బండు నిర్మించి వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచనలు చేసినట్లు సమాచారం. అనంతరం గుర్రపు డెక్కా తొలగించేందుకు ఎఫ్‌టీసీ యంత్రాన్ని ప్రారంభించారు. చెరువుకు ఆనుకుని ఉన్న ఎరుకుల బస్తీ వాసుల ఇళ్లు హైడ్రా వల్ల ఇళ్లు ఏమి పోవని వారికి భరోసా ఇచ్చారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ, ఏఈఈ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



కమ్యూనిటీహాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. 15వ డివిజన్ రాజలింగం కాలనీ ఫేస్ – 2లో రూ. 20 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీహాల్ నిర్మాణం, మరో రూ.6లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దశల వారీగా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రారంభించిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. 15వ డివిజన్ కార్పొరేటర్ కొత్త దుర్గమ్మగౌడ్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

చోరీకి విఫలయత్నం

- వాచ్‌మెన్ అప్రమత్తం..
- పారిపోయిన దుండగుడు

ఉప్పల్: అమ్మవారి దేవాలయంలో చోరీకి యత్నించిన దుండగుడు వాచ్‌మెన్ అప్రమత్తతతో పరారయ్యాడు. దీంతో ఆలయ క్లర్క్ రాచమళ్ల చంద్రశేఖర్ ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ వెలుగుట్టలోని శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున దేవాలయంలో పూజారి బుధవారం రాత్రి పూజల అనంతరం ఆలయానికి తాళంవేసి వెళ్లిపోగా.. వాచ్‌మెన్ పరశురామం మాత్రమే అక్కడ ఉన్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఆలయంలో శబ్దం రావడంతో అప్రమత్తమై కేకలు వేశాడు. దీంతో అప్పటికే తాళం తొలగించిన దొంగ భయాందోళనతో పారిపోయాడు. దీంతో పరశురాం ఆలయ నిర్వాహకులకు ఫోన్‌ద్వారా, పోలీసులకు సమాచారం అందించారు. వాచ్‌మెన్ ధైర్య సాహసాలను పోలీసులు అభినందించారు. చోరీకి సంబంధించిన సీసీఫుటేజీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

నెలలో ఇది రెండోసారి..

వెలుగుట్ట శ్రీ దుర్గా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆగస్టు నెలలో ఇదే విధంగా గుర్తు తెలియని అగంతకుడు గుడిలోపలకి వచ్చి హుండీని ఊడ్చుకెళ్లాడు. ఆ కేసు నిందితుడు తేలక ముందే మరోసారి ఈ దొంగతనం జరగడంపై భక్తులు ఆందోళన చెందుతున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

ఘట్‌కేసర్: విధుల సమయం మార్చొద్దని కోరుతూ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికులు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉదయం, సాయంత్రం రెండు పూటల విధులు నిర్వహించాలనడం సరికాదన్నారు. గతంలో ఉన్న విధంగానే ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వహిస్తామని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



పంచాయతీ ఎన్నికలు జరిగేనా?

'విలీనం'తో భారీగా తగ్గిన పంచాయతీలు

మేడ్చల్: దసరా పండగ తర్వాత ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించి సర్పంచ్‌లను ఎన్నుకోవాలని వడివడిగా పనులు చేస్తుంటే మేడ్చల్ నియోజకవర్గంలో ఎన్నికలు ఉంటాయా లేదా తెలియకపోవడంతో అనిశ్చితి ఏర్పడింది. గత ఐదేళ్ల క్రితం మేడ్చల్ నియోజకవర్గంలో 62 గ్రామ పంచాయతీలుండగా.. ప్రభుత్వం ఇటీవల హైదరాబాద్ విస్తరణ పేరుతో 28 గ్రామాలను 7 మున్సిపాలిటీలలో విలీనం చేసింది. మిగిలింది మూడు మండలాలు.. 33 గ్రామాలు, 5 మండల పరిషత్‌లు, మూడు జిల్లా పరిషత్‌లు ఉన్న మేడ్చల్ నేడు మూడు మండలాలకు పరిమితమైంది. గ్రామాల విలీనంతో జిల్లా పరిషత్, మండల పరిషత్ వ్యవస్థను పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఉంది. మేడ్చల్, శామీర్‌పేట్, మూడు చింతలపల్లి మండలాలే మిగలగా కీసర, ఘట్‌కేసర్ మండలాలు కనుమరుగై కేవలం రెవెన్యూ మండలాలుగానే ఉండనున్నాయి. తాజాగా మూడు మండలాల్లో కలిపి 33 గ్రామాలు మాత్రమే గ్రామ పంచాయతీలుగా ఉండనున్నాయి. మిగిలిన 33 గ్రామాలకు పంచాయతీ ఎన్నికలు ఉంటాయా? లేదా.. తెలియక ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచనలో ఉన్న నాయకులు తీవ్రంగా మదన పడుతున్నారు. మున్సిపాలిటీల్లో విలీన ప్రక్రియ ముగియడంతో మేడ్చల్ మండలంలో 13 గ్రామాలు, శామీర్‌పేట్ మండలంలో 7 గ్రామాలు, మూడు చింతలపల్లిలో 13 గ్రామాలు ఉన్నాయి. 33 గ్రామాల భవిష్యత్‌పై జోరుగా చర్చలు జరుగుతున్నాయి.

ఏర్పాట్లు చేస్తున్న అధికారులు..

ఎన్నికల ప్రక్రియలో భాగంగా పంచాయతీరాజ్ అధికారులు ఎన్నికల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. అఖిలపక్ష నాయకుల సమావేశాలు, గ్రామాల్లో వార్డుల వారీగా ఓటరు జాబితా ప్రకటనలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఓటరు జాబితా సవరణలో మార్పులు, చేర్పులు వంటి పనులు చేపడుతున్నారు.

స్పష్టత లేదు..

మేడ్చల్ నియోజకవర్గంలో మిగిలిన 33 గ్రామ పంచాయతీలకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల లోపు ఎన్నికలు ఉంటాయా లేదా అనే విషయం పాలకుల్లో, అధికారుల్లో స్పష్టత లేకుండా పోయింది. అధికారులు మాత్రం తాము ప్రభుత్వం చెప్పిన విధంగా నిరంతర ప్రక్రియలు సాగిస్తున్నామని ఎన్నికలు ఉంటాయా ఉండవా అనే విషయాన్ని తాము చెప్పలేమని చెబుతున్నారు. అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం తమకు ఎలాంటి సమాచారం అందడం లేదని వాపోతున్నారు.



మున్సిపాలిటీలా..గ్రామ పంచాయతీలా..

మేడ్చల్ నియోజకవర్గంలోని ఘట్‌కేసర్, కీసర మండలాల్లో గ్రామ పంచాయతీలు లేకుండా పోయాయి. రెండు మండలాలు ఘట్‌కేసర్, పోచారం, దమ్మాయిగూడ, నాగారం మున్సిపాలిటీలుగా ఉన్నాయి. మేడ్చల్ మండలంలో 13, మూడు చింతలపల్లి మండలాల్లో 13 గ్రామాలు ఉండగా శామీర్‌పేట్ మండలంలో 7 గ్రామాలు ఉన్నాయి. ఈ మండలాల్లోని గ్రామాలను మున్సిపాలిటీలుగా మారుస్తారా అనే విషయంపై స్పష్టత లేకుండా పోయింది. మేడ్చల్ మండలంలో మిగిలిన 13 గ్రామాలను డబీల్‌పూర్, రావల్‌కోల్ కేంద్రాలుగా రెండు మున్సిపాలిటీలు, శామీర్‌పేట్, మూడు చింతలపల్లి గ్రామాలను కలిపి అలియాబాద్, మూడు చింతలపల్లి కేంద్రాలుగా రెండు మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేస్తున్నారనేది విశ్వసనీయ సమాచారం. మొత్తం మీద మేడ్చల్ నియోజకవర్గంలో గ్రామ పంచాయతీకు ఎన్నికలు ఉంటాయా లేదా అనేది సమాధానం లేని చర్చగా మారింది.